## క్లుప్తంగా

### పీహెచ్‌సీలో విధులకు హాజరుకాని వైద్యులు



**పెనమలూరు:** ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో వైద్యులు సమ్మెకు దిగటంతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవటంతో రెండు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. పెనమలూరు, పోరంకి పీహెచ్‌సీల్లో వైద్యులు విధులకు రాకపోవటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం ఐదుగురు వైద్యులు విధులకు రావటం లేదు. పీహెచ్‌సీలో ఉన్న సిబ్బంది రోగులకు మందులు పంపిణీ చేస్తున్నారు. జ్వరాలు ఎక్కువగా ఉండటంతో వైద్యులు అందుబాటులో లేకపోవటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



**ఉయ్యూరు:** పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేసి విద్యాభివృద్ధికి పాటుపడటం సామాజిక బాధ్యత అని విజయలక్ష్మి ట్రేడర్స్ అధినేత కొలసాని పెదబాబు అన్నారు. జిందాల్ పాంథార్ కంపెనీ ఆధ్వర్యంలో ఉయ్యూరు పట్టణంలో ఇద్దరు తాపీ మేస్త్రీల కుటుంబాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఉపకార వేతనాలు అందజేశారు. పెదబాబు మాట్లాడుతూ జిందాల్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా తాపీ కార్మికుల కుటుంబాలను ఆదుకోవటానికి ముందుకు రావటం అభినందనీయమన్నారు. 17 మంది విద్యార్థులకు వారి చదువుకు అయ్యే ఖర్చును భరించటం విద్యాభివృద్ధికి బాటలు వేయటమేనని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మల్లేష్, ప్రసాద్, కార్మిక నాయకులు శివ, రాంబాబు పాల్గొన్నారు.

### కీర్తి పురస్కార గ్రహీత శోభనాద్రికి సత్కారం



**భవానీపురం(విజయవాడపశ్చిమ):** వ్యక్తిత్వ వికాస రంగంలో విశేష కృషి కృషి చేసిన విజయవాడకు చెందిన తిరుక్కోళ్లూరి శోభనాద్రికి గాడిచర్ల హరిసర్వోత్తమరావు–బీవీ దాశరథి కీర్తి పురస్కారాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఇటీవల హైదరాబాద్‌లో ప్రదానం చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, చిన్నయ సూరి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి ఎస్వీ శేషగిరిరావు బుధవారం రామవరప్పాడులోని ఆయన నివాసంలో అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ శోభనాద్రి 92 ఏళ్ల వయసులో కీర్తి పురస్కారాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికీ సామాజిక, సాంఘిక, సాంస్కృతిక, సాహితీ రంగాలలో సేవలు అందించడం ఆయనలోని తపనకు నిదర్శనమని కొనియాడారు. సాహితీ పీఠం సభ్యులు పి. వెంకటేశ్వరరావు, పావని విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.


### విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** బాపులపాడు మండలం కొత్త రేమల్లే విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళ్లితే.. గ్రామానికి చెందిన తొమ్మండ్రు బాబీ(38) బుధవారం తన ఇంటి వద్ద ఉన్న చెట్టు నరుకుతుండగా, ఆ చెట్టు కొమ్మ హైటెన్షన్ విద్యుత్ తీగలపైకి వాలింది. దీంతో ఆ చెట్టు కొమ్మను పక్కకు లాగేందుకు పట్టుకున్న బాబీ తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన వైద్యులను సంప్రదించగా, అప్పటికే బాబీ మృతి చెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వీరవల్లి పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. బాబీ మృతిపై వివరాలు ఆరా తీశారు. వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.


# మహిషాసుర మర్దినీ రక్షమాం

- వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవార్లకు విశేష పూజలు, హోమాలు
- ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ


పెద ఓగిరాల శివాలయంలో మహిషాసుర మర్దినిగా..


ఉయ్యూరు శివాలయంలో..


జంక్షన్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో..


దావాజిగూడెం రామాలయంలో అమ్మవారు


యనమలకుదురులో రాజరాజేశ్వరీదేవిగా పార్వతీదేవి


మహిషాసురమర్దినిగా కనకదుర్గ అమ్మవారు

**ఉయ్యూరు:** మహిషాసురమర్దిని.. పాహిమాం... రక్షమాం..అంటూ భక్తజనం దుర్గమ్మను పూజించారు. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పదో రోజైన బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఉయ్యూరు పట్టణం, మండలంలోని గ్రామాల్లో వివిధ రూపాల్లో కొలువైన అమ్మవారు మహిషాసురమర్దినీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పెద ఓగిరాల, ఉయ్యూరులో కుంకుమ పూజలు చేశారు.

**పెనమలూరు:** యనమలకుదురు లాకు సెంటర్‌లో వేం చేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శ్రీ మహిషాసురమర్దినీదేవిగా అలంకరించారు. పోరంకి గ్రామదేవత గంగారమ్మ ఆలయంలో, పెదపులిపాక శ్రీ విజయరాజరాజేశ్వరి ఆలయంలో, పోరంకి శ్రీనగర్‌కాలనీలో శ్రీకోదండ రామాలయంలో, శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో అమ్మవార్లను శ్రీమహిషాసురమర్దినీదేవిగా అలంకరించగా భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పెనమలూరు చిన్నగుడికి భక్తులు భారీగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

యనమలకుదురులో వేం చేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శ్రీ పార్వతీదేవి అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేసి, చండీ హోమం నిర్వహించారు. భక్తులు కుంకుమ పూజలు చేశారు. శ్రీరామలింగేశ్వర ట్రస్ట్ సహకారంతో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కానూరు సనత్‌నగర్‌లో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి పాల్గొన్నారు. ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

**కంకిపాడు:** రక్షించమ్మా.. మహిషాసురమర్దినీదేవి.. అంటూ భక్తజనం అమ్మవారికి పూజలు జరిపించారు. బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. కంకిపాడు, ప్రొద్దుటూరు, మద్దూరు, ఈడుపుగల్లు, మంతెన, ఉప్పలూరు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారికి కుంకుమ పూజలు చేయించారు. కంకిపాడు శివాలయంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

**గన్నవరం:** స్థానిక సొసైటీపేటలోని శ్రీగాయత్రి అమ్మవారి మందిరంలో నవదుర్గ, రుద్ర హోమాలు నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో పలువురు దంపతులచే శ్రీమహిషాసుర మర్దినీదేవికి పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు జరిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి నిమ్మకాయలతో పూజలు నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిరం, యాదవులపేట రామాలయం, శ్రీకనకదుర్గమ్మ ఆలయం, దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి


కానూరులో పూజలు చేస్తున్న దేవభక్తుని చక్రవర్తి

**నున్న(విజయవాడరూరల్):** ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం చినకంచిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 10వ రోజు బుధవారం కామాక్షి అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దినీదేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. సకల దేవతల శక్తులన్నీ మూర్తీభవించిన అమ్మవారు మహిషాసుర సంహారం జరిగిన రోజు మహార్నవమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ జరిగింది. దేవదాయశాఖకు చెందిన శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో, సాయిబాబా మందిరంలో, శ్రీకనకదుర్గ దేవస్థానంలో అమ్మవార్లు మహిషాసురమర్దినీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

**రామవరప్పాడు:** విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం అమ్మవార్లు శ్రీ మహిషాసురమర్దినీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగు భజన బృందాలచే ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఓం నమఃశివాయ 47వ ఏకాహం 24 గంటల పాటు కొనసాగింది.


**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, ఐటీఐ రోడ్డులోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానం, ఏలూరురోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాలతో పాటు మహాత్మాగాంధీనగర్, ఎన్టీఆర్ కాలనీల్లో ప్రత్యేక ఉత్సవ మండపాల్లో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లు మహిషాసుర మర్దినీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విజయలక్ష్మిగా పూజలందుకున్నారు. ఆలయ ధర్మకర్త కాకాని వెంకటేశ్వరరావు సతీమణి, మాజీ సర్పంచ్ కాకాని అరుణ అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు,కుంకుమ, గాజులు సమర్పించారు. మహాత్మాగాంధీ నగర్‌లో మహా అన్నప్రసాద వితరణ జరిగింది.


పోరంకి గంగానమ్మ గుడి వద్ద..


చినకంచిలో మహిషాసుర మర్దినీగా కామాక్షి అమ్మవారు


మద్దూరులో మహిషాసురమర్దినిగా దుర్గమ్మ


ప్రొద్దుటూరు శివాలయంలో..


ఉప్పలూరులో మహిషాసురమర్దినిగా అమ్మవారు


మహిషాసురమర్దినీదేవిగా పేరంటాలమ్మ

## గ్రామ పంచాయతీల ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలి

**గన్నవరం:** మండలంలోని కేసరపల్లి గ్రామంలో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. తొలుత ఎస్సీ కాలనీలోని పలు ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అనంతరం దుర్గాపురంలోని హెచ్‌సీఎల్ సమీపంలో గ్రామపంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన కుంభకోణం డిగ్రీ కాఫీ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు.

కేసరపల్లి, బుద్ధవరం, గన్నవరం గ్రామపంచాయతీలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛరథాన్ని ఎమ్మెల్యే ప్రారంభించడంతో పాటు వాహనాన్ని నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల ఆదాయాన్ని పెంచుకునే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలన్నారు. తద్వారా గ్రామాల్లో రెట్టింపు స్థాయిలో అభివృద్ధి పనులు చేయాలని చెప్పారు. సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఎంపీడీఓ టి.స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛ రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

## జీఎస్టీ సంస్కరణలపై రైతులకు అవగాహన

**పెనమలూరు:** రైతులు ఉపయోగించే యంత్ర పరికరాలపై జీఎస్టీ తగ్గించటంతో ధరలు తగ్గాయని ఎంపీడీవో డాక్టర్ బండి ప్రణవి అన్నారు. ఆమె బుధవారం గ్రామాల్లో జీఎస్టీపై ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జీఎస్టీ 2.0లో ట్రాక్టర్ల విడిభాగాలు, డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింక్లర్‌లు, వ్యవసాయానికి ఉపయోగించే డ్రోన్‌లు, పలు పరికరాల ధరలు తగ్గాయని కరపత్రాలతో ప్రచారం చేశారు. మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ మాట్లాడుతూ.. రైతులు తగ్గిన జీఎస్టీపై పూర్తి అవగాహన పొందాలని తెలిపారు. తగ్గిన జీఎస్టీ పట్ల రైతులకు చాలా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**గన్నవరం:** మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో రైతు సేవ కేంద్రం వద్ద బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె. శివప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల వారికి మేలు జరుగుతుందన్నారు. ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, పరికరాలు, ఎరువులు, బయో పురుగు మందుల ధరలు తగ్గాయని తెలిపారు. తద్వారా వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. పెనమలూరు సర్కిల్ డీసీటీఓ బి.కిరణ్‌కుమార్, పశు వైద్యాధికారి బి.లక్ష్మీవైదూర్యం, వీఏఏలు పాల్గొన్నారు.

**కంకిపాడు:** జీఎస్టీ కుదింపుతో రైతులకు మేలు చేకూరుతుందని స్టేట్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఏ.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కంకిపాడు, గొడవర్రు గ్రామాల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీ తగ్గింపుతో రైతులకు లాభం చేకూరుతుందన్నారు. ఆదాయం రెట్టింపు అవ్వటంతో పాటుగా ఖర్చులు తగ్గుతాయన్నారు. యాంత్రీకరణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెలివెల ఉషారాణి, విస్తరణాధికారి భవాని, రైతులు పాల్గొన్నారు.


కంకిపాడు మండలంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధుల బృందం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) 2.0తో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి అన్నారు. బాపులపాడు మండలం రేమల్లేలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ 2.0' ప్రచార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండల ఉద్యాన అధికారి జోసఫ్ సుందరం, గ్రామ ఉద్యాన సహాయకురాలు వి.దీక్ష, రైతులు పాల్గొన్నారు.

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** జీఎస్టీ 2.0 రేట్ల ప్రకారమే విక్రయాలు సాగించాలంటూ గ్రామ సచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం ప్రతి దుకాణానికి వెళ్లి వర్తకులకు కరపత్రాలు పంపిణీ చేయటంతో పాటుగా అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణలు గత నెల 22వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయని, వాటికి అనుగుణంగా వ్యాపారులు నడుకోవాలని సూచించారు. బాపులపాడు గ్రామ సచివాలయం–1 డిజిటల్ అసిస్టెంట్ అఖిల, వేల్ఫేర్ అసిస్టెంట్ రాధా కల్యాణి, మహిళా పోలీస్ సౌభాగ్యం, గ్రామ సర్వేయర్ చైతన్య పాల్గొన్నారు.

## వృద్ధులకు అండగా ఉండాలి



**పెనమలూరు:** వృద్ధులకు సమాజంలో అందరూ అండగా నిలిచి ప్రేమాభిమానాలు చూపాలని వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గోసాల వాసవ్య మహిళా మండలికి చెందిన బంధం వృద్ధుల ఆశ్రమంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. తాము 1993వ సంవత్సరంలో వృద్ధుల ఆశ్రమం 10 మందితో ప్రారంభించామన్నారు. వృద్ధులకు ఇంట్లో ఆదరణ, గౌరవం లేకపోతే వారిని ఆదుకోవాలనే ఆలోచనతోనే వృద్ధుల ఆశ్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. వృద్ధులకు నిత్యావసరాలతో పాటు పోషకాహారం, మందులు ఇస్తున్నామన్నారు. వృద్ధుల కోరిక ప్రకారం వారిని దైవదర్శనాలకు, బీచ్‌కు, సినిమాలకు తీసుకు వెళ్తున్నట్లు చెప్పారు. పెనమలూరు ఎస్‌బీఐ మేనేజర్ కొల్లి రజిని మాట్లాడుతూ.. ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా వృద్ధులకు సేవలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా తమ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కృష్ణకిషోర్, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు, వృద్ధులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకు సచివాలయ సిబ్బంది నోటీసు అందజేత



**పెనమలూరు:** పెనమలూరు మండల పరిధిలో ఉన్న సచివాలయ సిబ్బంది బుధవారం ఎంపీడీవో డాక్టర్ బండి ప్రణవికి నోటీసు అందజేశారు. సచివాలయ సిబ్బంది మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి ఎంపీడీవోకు తమ డిమాండ్లతో ఉన్న నోటీసు ఇచ్చి తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. సచివాలయ సిబ్బందికి ఉద్యోగోన్నతులు, వారి విధులకు సంబంధం లేకుండా పనులు కేటాయించరాదని, పని ఒత్తిడి తగ్గించాలని, సర్వేలు తొలగించాలని, అంతర్ జిల్లాల బదిలీలు ఇలా పలు డిమాండ్లతో కూడిన నోటీసును ఎంపీడీవోకు అందించారు. ప్రస్తుతం తాము పింఛన్లను నల్ల బ్యాడ్జి ధరించి పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ప్రత్యక్ష సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయం జేఏసీ నేతలు పాల్గొన్నారు.

## పిల్లలు వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండాలి



**పెనమలూరు:** చిన్నారులు వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండాలని సీహెచ్‌వో పి.లక్ష్మీసునీత తెలిపారు. వణుకూరు 4వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా శిశువు, చిన్నారుల ఆహారం ఇవ్వటం అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని వివరాలు వెల్లడించారు. చిన్నారులు వయసుకు తగ్గ బరువు ఉండాలని సూచించారు. పిల్లలు అధిక బరువుగా ఉంటే అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. చిన్నారులకు ఆకుకూరలు, పోషకాహారం ఇవ్వాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగించాలన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలని తెలిపారు. అలాగే పిల్లల ఎదుగుదలను తల్లిదండ్రులు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి.కాశేశ్వరీదేవి, తల్లులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వరద ఉధృతి

**కంకిపాడు:** ఏటిపాయలో వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువ నుంచి వరదనీటి విడుదల స్వల్పంగా తగ్గిన ఉధృతి యథాతథంగా సాగుతోంది. ఏటిపాయ అంచులు తాకుతూ, కరకట్ట దిగువుగా వరదనీరు పొంగిపొర్లుతోంది. బుధవారం సాయంత్రం 6.20 లక్షల వరదనీరు ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలై కడలివైపు ప్రవహిస్తోంది. ప్రస్తుతం ఏటిపాయ అంచులు తాకుతూ వరదనీరు ఉధృతంగా సాగుతోంది. రెండు రోజులుగా కరకట్ట దిగువున సాగులో ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. ప్రధానంగా పసుపు, కంద, తమలపాకు, కూరగాయల తోటలు, అరటి, చెరకు తోటలు నీట మునిగాయి. రెండు రోజులుగా వరద నీరు పొలాలను వీడటం లేదు. వరద నీరు పొలాల్లో నుంచి కదలటం లేదు. దీంతో అరటి, చెరకు రైతులకు నష్టం లేకపోయినా పసుపు, కంద, తమలపాకు, కూరగాయ తోటల రైతులు మాత్రం పంట పొలాలు మునిగిపోవటంతో ఆందోళన చెందుతున్నారు.

మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధిలోని ఏటిపాయ రహదారులు పూర్తిగా నీట మునిగాయి. దీంతో ఏటిపాయలోకి వెళ్లే మార్గాలు మూసుకుపోవటంతో స్థానికులు, రైతులు, కూలీలు పడవలను ఆశ్రయించి లంక భూముల్లోకి వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చి భద్రపర్చటంతో పాటుగా ఏటి ఒడ్డున చేపల వేట సాగిస్తున్నారు. మరో వైపు అధికారులు ఏటిపాయ వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. చేపల వేటకు, పశువుల మేతకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నిరంతరం బందోబస్తు నిర్వహిస్తున్నారు.


కాసరనేనివారిపాలెం వద్ద నీట మునిగిన ఆలయం